నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 12 మే 2025 | VIKARABAD



ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందిన ఇండియన్ ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు ఆదివారం బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తన నివాసంలో ఘనంగా నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్మీ జవాన్ చిత్రపటానికి పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత్‌కు చేసిన సేవలను కొనియాడారు. - వికారాబాద్, మే 11



మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట జనగామ, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీహరియాదవ్, మాణిక్ రెడ్డి, జయవంత్, రవియాదవ్ ఉన్నారు. - మొయినాబాద్, మే 11

# అస్తవ్యస్తంగా భూసేకరణ



జిల్లాలో వివిధ ప్రజావసరాల పేరుతో ప్రభుత్వం సేకరించే భూసేకరణపై సరైన స్పష్టత లేదని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున భూసేకరణకు తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం 2016 భూసేకరణ చట్టంలో మినహాయింపులతోనే మళ్లీ భూసేకరణ చేపట్టడంపై రైతులు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 భూసేకరణ చట్టం మినహాయింపుల ద్వారా ఫార్మాసిటీ భూసేకరణ చేపడితే మినహాయింపులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ.. తాము అధికారంలోకి వస్తే భూసేకరణలో మినహాయింపులు లేకుండా చట్టసవరణ చేస్తామని ప్రకటించింది. కాని, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చట్టంలో ఎలాంటి మార్పులు చేయకుండానే గత ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ద్వారానే కొత్తగా భూసేకరణకు తెరలేపింది. ప్రభుత్వం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు కోసం సుమారు వెయ్యి ఎకరాల భూసేకరణ మొదలుపెట్టింది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుతో ఈ భూసేకరణ ద్వారా సుమారు 12వందల మంది రైతులు భూములను కోల్పోతున్నారు. వీరిలో అత్యధికంగా సన్నచిన్నకారు రైతులే. ఈ భూములను నమ్ముకుని జీవిస్తున్నారు. 2016 భూసేకరణ చట్టంలో మినహాయింపుల ద్వారా భూసేకరణ చేపట్టడం ద్వారా రైతులకు సరైన పరిహారం అందకపోగా.. వారికి రావాల్సిన పునరావాసం, ఇతర సదుపాయాలు కూడా అందకుండాపోయాయి. ప్రస్తుతం జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో 2016 భూసేకరణ చట్టంలో మినహాయింపులు లేకుండా భూములు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- రంగారెడ్డి, మే 11 (నమస్తే తెలంగాణ)

- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 భూసేకరణ చట్టంతో నష్టం జరుగుతుందని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ
- నేడు అదే చట్టంతో సుమారు 1000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ భూసేకరణ
- దీంతో భూములు కోల్పోనున్న 1200ల మంది రైతులు
- పునరావాసం, ఇతర సదుపాయాలకు దూరం
- మినహాయింపులు లేకుండా సేకరణ చేయాలని కోరుతున్న ప్రజలు

2016 భూసేకరణ చట్టంలో సెక్షన్ 2, 4, 10ల మినహాయింపు ద్వారా భూసేకరణ చేస్తున్నారు. ఈ మినహాయింపులతో రైతులు తమ హక్కులను పెద్దమొత్తంలో కోల్పోతున్నారు. సెక్షన్ 2లో భూసేకరణకు 80 శాతం మంది రైతులు అంగీకారం తెలిపిన తర్వాతనే భూసేకరణ చేయాల్సి ఉంటుంది. సెక్షన్ 4 ప్రకారం భూసేకరణతో చేపట్టే ప్రాజెక్టు ద్వారా విస్తృతంగా రైతులకు ప్రయోజనాలు కల్పించే అవకాశాలుంటాయి. అలాగే, సెక్షన్ 10 ప్రకారం బహుళ పంటలు (ఏడాదికి రెండు పంటలు) పండే భూములను తీసుకోవద్దని నిబంధన ఉన్నది. అత్యవసరమైతే తప్పా తీసుకునే భూములు కనిష్ట స్థాయిలో ఉండాలి. అలాగే, ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు, 18 ఏళ్లు పైబడిన ప్రతి కుటుంబ సభ్యుడికి పరిహారం అందించాల్సి ఉంటుంది. అలాగే, ఆ గ్రామంలో స్థిరపడిన కూలీలకు సైతం పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. 2016 భూసేకరణ చట్టంలో మినహాయింపుల వలన రైతులు వీటన్నింటినీ కోల్పోతున్నారు. మినహాయింపులు లేకుండా భూసేకరణ చేపట్టాలని కోరుతున్నారు.

### మినహాయింపులు లేకుండా భూసేకరణ చేపట్టాలి



ప్రభుత్వం చేపట్టే భూసేకరణ రైతులకు ప్రయోజనకరంగా ఉండాలి. వారికి ఉపయోగపడే అతి ముఖ్యమైన సెక్షన్లను మినహాయించి భూసేకరణ జరపడంవలన తీవ్రంగా నష్టపోతున్నారు. తమ విలువైన భూములను బలవంతంగా సేకరించి వారికి కొద్దిపాటి పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

- సరస్వతి, ఫార్మా వ్యతిరేక భూ పోరాట సమితి కన్వీనర్

### ఫార్మా రైతుల ప్లాట్లపై నోరు మెదపని ప్రభుత్వం


ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులందరికీ మీర్‌ఖాన్‌పేట్ సమీపంలో ప్లాట్లను చేసి సర్టిఫికెట్లను కూడా కేటాయించింది. కాని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్టిఫికెట్లు పొందిన ఫార్మా రైతులకు భూములు చూపించడంలేదు. గత సంక్రాంతి నాటికే ఫార్మా బాధిత రైతులందరికీ ఇండ్ల స్థలాలను ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయిస్తామని ప్రకటించింది. కాని, ఇప్పటికీ అతీ..గతీ లేదు.

### మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ

తాము అధికారంలోకి వస్తే భూసేకరణ చట్టంలో మినహాయింపులు లేకుండా చట్టాన్ని సవరిస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చట్టంలో మార్పులు చేయకుండానే భూసేకరణ చేపడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016 భూసేకరణ మినహాయింపు చట్టంలో భూసేకరణ జరపడం వలన రైతులు పెద్దఎత్తున నష్టపోయారని గతంలో ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చట్టసవరణ చేయకపోవడంపై రైతులు ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

# సృష్టికి మూలం అమ్మ

- అమ్మ రుణం కోటి జన్మలెత్తినా తీర్చలేనిది
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కడ్తాల్‌లో గర్భిణులకు మెడికల్ కిట్లను అందజేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, జైపాల్‌యాదవ్, రజినిసాయిచంద్, ఉప్పల వెంకటేశ్

కడ్తాల్, మే 11 : ప్రపంచంలో అమ్మలేని గ్రామం, దేశం లేదని., సృష్టికి మూలం అమ్మ అని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ అన్నారు. ఆదివారం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన, ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కడ్తాల్‌లోని అంగన్‌వాడీ సబ్ సెంటర్‌లో మండలంలోని గర్భిణులకు న్యూట్రిషన్, మెడికల్ కిట్లను తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తాతో కలిసి వారు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమ్మతనం మాటల్లో వర్ణించలేనిదని, అక్షరాల్లో రాయలేనిది అమ్మ ప్రేమ.. ఈ సృష్టిలో తియ్యని పదం అమ్మ.. వెలకట్టలేనిది అమ్మ ప్రేమ అని పేర్కొన్నారు. ఆప్యాయతలో ఇంకెవరూ సాటిరారన్నారు. ప్రస్తుత తరుణంలో యువత చెడు అలవాట్లకు బానిసై అమ్మతనాన్ని మరిచి కొత్తపుంతలు తొక్కుతున్నారని.. అలాంటి వారిని ఆ దైవమే రక్షించాలన్నారు. ఈ సందర్భంగా 240 గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సతీమణి మంజుల, కుమారుడు, కోడలు అనిల్, భావన, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, సీనియర్ నాయకులు చంద్రమౌళి, లచ్చిరాం, నర్సింహ, సాయిలు, లక్ష్మీనర్సింహారెడ్డి, జ్యోతయ్య, గోపాల్, వెంకటేశ్, శంకర్, శ్రీనివాస్, గోపాల్, సురేశ్, శ్రీకాంత్, గణేశ్, మహేశ్, రంగయ్య, రమేశ్, సాయిలు, జంగయ్య, రామకృష్ణ, యాదయ్య, లాయక్‌అలీ, రవి పాల్గొన్నారు.

## పీపీపీ విభాగంలో మనదే బెస్ట్ మెట్రో

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న హార్వర్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ మెట్రో ప్రపంచంలోనే అత్యుత్తమ పీపీపీ మెట్రోగా పేర్కొంది. వర్సిటీ విద్యార్థుల అధ్యయనానికి పరిశోధన పత్రాలుగా మెట్రో ప్రాజెక్టును ఎంపిక చేసుకుంది. రవాణా వ్యవస్థ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, నిర్మాణంలో నూతన ఒరవడి, ఎదురైన సవాళ్లు, చూపిన పరిష్కారాలతో కూడిన పరిశోధనా పత్రాన్ని కేస్ స్టడీగా స్వీకరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజా రవాణా వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు వచ్చిందని, భూసేకరణ సమస్యలు, ఆర్థిక సవాళ్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోనే హైదరాబాద్ మెట్రో అత్యుత్తమ మెట్రో వ్యవస్థగా పేర్కొన్నారు. దశలవారీగా చేపట్టిన ప్రాజెక్టు ప్రగతిని కేస్ స్టడీలో ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే ఐఎస్‌బీ, స్టాన్‌ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు హైదరాబాద్ మెట్రో రైలును ప్రస్తావించడం హైదరాబాద్ నగరానికి దక్కిన అరుదైన గౌరవమని హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.



# రహదారికి రంగులద్దిన హరితహారం

తెలంగాణకు హరితహారం పేరుతో గత కేసీఆర్ ప్రభుత్వం రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు పెరిగి పెద్దవై రంగురంగుల పూలను విరబూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని పలు పల్లెలకు వెళ్తుంటే రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు స్వచ్ఛమైన గాలితోపాటు రంగురంగుల పూలతో స్వాగతం పలుకుతున్నాయి. గత కేసీఆర్ పాలనలో ప్రారంభించిన హరితహారం కార్యక్రమం దీర్ఘకాలిక ప్రయోజనాలను ఇస్తున్నదని ప్రజలు ప్రశంసిస్తున్నారు. - కొందుర్గు, మే 11

# సమస్యలపై పట్టింపేది..?

- మొక్కలు ఎండిపోయి మోడువారుతున్న ప్రకృతివనాలు
- ఏడాదికిపైగానే నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు
- సరిపడా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- బావి నీటితో సరిపెడుతున్న అధికారులు




ఆలనాపాలన కరువైన అన్నారం పల్లె ప్రకృతివనం

పరిగి, మే 11 : మొక్కల పెంపకంతో పచ్చదనం పెంపకానికి గత సర్కారు హయాంలో కృషి జరుగగా, నేటి పాలనలో మొక్కల పెంపకంపై అధికారులు పట్టింపు లేని ధోరణి అవలంబిస్తుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. కనీసం నాలుగైదు సంవత్సరాల వరకు మొక్కలకు నీరు పోయడం ద్వారా వాటి ఎదుగుదల బాగుంటుంది. అందులోనూ మండుటెండల సమయంలో నీటిని పోయడం తప్పనిసరి. నీరు పోసేందుకు ప్రతి గ్రామపంచాయతీకి ఒక ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ ఉన్నప్పటికీ వాటి వినియోగం సరిగ్గా జరగడంలేదు. ఏడాదికిపైగా పాలకవర్గాలు లేని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శుల పని తీరు సరిగ్గా లేక మొక్కలకు నీరు పోసేవారు కరువయ్యారు. ఇందుకు తార్కాణం పరిగి మండలం బర్కత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అన్నారం రెవెన్యూ గ్రామ పల్లె ప్రకృతి వనం. బర్కత్‌పల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండు పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. బర్కత్‌పల్లి, అన్నారం రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములలో ఈ పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. బర్కత్‌పల్లి ప్రకృతివనంలోని రోడ్డువైపు మొక్కలు బాగుండగా.. వెనకాల ఉన్నవి ఎండిపోయాయి. అన్నారం పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కల ఆలనాపాలన చూసేవారు లేక సగం మొక్కలు ఎండిపోయి, పిచ్చిగడ్డితో నిండిపోయింది. ఉన్న మొక్కల్లో సగమే బతికి బట్టకట్టాయి. అవి సైతం గతంలో పోసిన నీటితో ఎంతో కొంత తట్టుకొని నిలబడి ఎదిగాయి. గత ఏడాదికిపైగా అటువైపు వెళ్లి నీళ్లు పోసినవారే లేరు. ట్యాంకర్ ఉన్నప్పటికీ నీరు పోయించ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు.

### నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

బర్కత్‌పల్లికి ఆనుకొని ఉన్న స్థలంలో ప్రభుత్వం ద్వారా సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణం చేపట్టినా గత ఏడాదికి పైగా నిరుపయోగంగా ఉన్నది. నిర్మాణం చేపట్టిన తొలినాళ్లలో చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్డులో వేయడంతో గ్రామస్తులు సంతోషించారు. కొంతకాలం క్రితం సెగ్రిగేషన్ షెడ్డు, వాటర్ ట్యాంకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఈ క్రమంలో సెగ్రిగేషన్ షెడ్డుకు గల బోర్డును తొలగించి లోపల పడేశారు. చెత్తను వేరు చేయడం అటుంచి.. షెడ్డును వాడుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. కొన్నాళ్లుగా సెగ్రిగేషన్ షెడ్డు నిరుపయోగంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వాడుకలేని షెడ్డుతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదన్నారు. మరోవైపు గ్రామంలో రోజుకో గల్లీ చొప్పున చెత్త సేకరణ జరుగుతున్నదని గ్రామస్తులు తెలిపారు.



నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు



మిషన్ భగీరథ నీరు రానప్పుడు ఈ బావి నీరే దిక్కు..

### సరిపడా రాని మిషన్ భగీరథ నీరు

నస్కల్ గ్రామం నుంచి వచ్చే పైప్‌లైన్ వాల్వును ఆ గ్రామానికి అనుగుణంగా తిప్పుకుంటుండడంతో బర్కత్‌పల్లికి సరిపడా నీళ్లు రావడంలేదని ఆ గ్రామవాసులు వాపోయారు. కొద్ది రోజులు మరీ కొంత పరిమాణంలోనే నీళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువుకట్ట సమీపంలోని బావి నీటిని సరఫరా చేయడం జరుగుతున్నదని తెలిపారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

గ్రామంలో ఏదైనా సమస్యకు సంబంధించి విన్నవిస్తే పంచాయతీ కార్యదర్శి సకాలంలో స్పందించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సమస్యల పరిష్కారంలో సరైన చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పల్లె ప్రకృతివనంలో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని, సెగ్రిగేషన్ షెడ్డు ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అనుమతి లేకుండా మద్యం వినియోగం

- ఎక్సైజ్ పోలీసుల దాడి
- రూ.4లక్షల విలువ చేసే లిక్కర్ స్వాధీనం
- ఫంక్షన్ నిర్వాహకుడిపై కేసు



ఫంక్షన్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

మొయినాబాద్, మే 11 : ఓ వ్యక్తి అనుమతి లేకుండా ఫాంహౌస్‌లో జరిగిన విందులో స్వరాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను వినియోగించడంతో ఎక్సైజ్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి సుమారు రూ.4 లక్షల విలువ చేసే మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మొయినాబాద్ పరిధిలో జరిగింది. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరానికి చెందిన తేజారెడ్డికి మొయినాబాద్ పరిధిలో ఫాంహౌస్ ఉన్నది. అందులో శనివారం రాత్రి బంధువులు, స్నేహితులకు అతడు పెద్ద పార్టీ ఇచ్చాడు. స్వరాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వివిధ రకాల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా వినియోగించాడు. సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు ఆ ఫాంహౌస్‌పై దాడి చేసి.. ఢిల్లీకి చెందిన 50 బ్లాక్ లేబుల్ బాటిళ్లు, గోవాకు చెందిన నాలుగు చివాస్ రీగల్ బాటిళ్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్, 12 బీర్ బాటిళ్లు, 1 సూలా వైన్, 1 మాన్షన్ హౌస్ బ్రాండీని స్వాధీనం చేసుకున్నారు. ఆ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని, ఫంక్షన్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.